# బాధ్యత

నోట్లను లెక్క పెడుతున్న సునీత తల పైకెత్తి భర్త సుందరం కళ్ళలోకి చూసింది. అతను ఏదో ఆలోచిస్తున్నాడు.

"పదిహేను వందలు, క్రిందటినెల పద్దెనిమిది వందలు ఇచ్చారు... మూడు వందలు ఏమయ్యాయి?"

సుందరంకు బుస్సున కోపం వచ్చింది.

"మూడు వందలు నేనేం తాగెయ్య లేదులే..."

భర్త కంఠ స్వరంలోని తీవ్రతకు సునీత విస్మయం చెందింది. "అవే! ఎందుకంత కోపం? మూడు వందలు తగ్గాయి అని అడిగాను... అంతేగా?"

"అంటే ప్రతి పైసాకు నీకు లెక్క చెప్పాలా?" విసుగ్గా అన్నాడు.

సునీత చిన్న పుచ్చుకుంది.

"నాకెందుకండి! ఇవి కూడా మీ దగ్గరే ఉంచండి..." ఆ పదిహేను వందల్ని అతని చేతిలో పెట్టింది.

సుందరం, సునీతలు కొత్త దంపతులు వాళ్ళవివాహం జరిగి ఆర్నెల్లయినా... సునీత కాపురానికొచ్చి మూడు నెలలే అయింది. సుందరం బ్యాంకు ఆఫీసరు. జీతం రాగానే, మినహాయింపులు పోను, మిగిలిన డబ్బును ఆమె చేతిలో పెట్టి ఇల్లు నడపమంటూ ఉండేవాడు. సునీత చదువుకుంది... తెలివిగలది కాబట్టి అతనిచ్చే దాంట్లోనే సంసారం నడిపి ఓ రెండొందలు వెనకవేసేది కూడా.

"సునీతా... ఇప్పుడే డబ్బులు తీసుకోకపోతే... ఈనెలే కాదు... ఏ నెలా నీకు డబ్బులు ఇవ్వడే" కోపంగా అన్నాడు.

సునీత ఓ క్షణం ఆలోచించి ఆ డబ్బులు తీసుకుని మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె మనసు గాయపడింది. సంసారానికి వచ్చింతర్వాత అతను ఆమెను కోప్పడ్డం ఇదే మొదటిసారి.

అతను దాని గురించి ఇంక ఆలోచించలేదు. ఆ ప్రస్తావన వాళ్ళ మధ్య మళ్లీ రాలేదు.

ఓ రోజు సునీత తల్లి సంగీతమ్మ నుండి ఉత్తరం వచ్చింది. భర్త ఆఫీసుకు పోయాడు కాబట్టి తనొక్కతే ఇంట్లో ఉంది. తీరిగ్గా ఉత్తరం చదవడం మొదలెట్టింది.

కొత్తసంసారం ఎలా ఉందని ప్రశ్నిస్తూ... సంసారంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించింది సంగీతమ్మ. వాళ్ళ ఊరు విశేషాలు రాసింది. చివరి పేర చదువుతూంటే సునీతకు ఒళ్ళు జలదరించింది.

"సునీతా ! నువ్వు ఒట్టి అమాయకురాలివి . తెల్లనివన్నీ పాలు ...నల్లనివన్నీ నీళ్ళు అనుకునేదానిని జాగ్రత్త! అల్లుడిగారి ప్రవర్తన కాస్త కనిపెట్టి ఉండు. మొగాడ్ని నమ్మకూడదు. డబ్బులన్నీ సినిమాలకు , షికార్లకు , పేకాటకు ఇంకా మందులకు తగలేస్తూ ఉంటాడు. అందుకని అతని ఖర్చులమీద ఓ కన్నేసి ఉంచు. అంతే కాదు.!వచ్చిన డబ్బులన్నీ వాళ్ళకి వీళ్ళకి పంపించి నీ సంసారం గుల్ల చేస్తాడేమో ఓ కంట కనిపెట్టు... జాగ్రత్త! మేం ఎన్ని చెప్పినా బయటి వాళ్ళమే.. నీ సంసారం నీది. సంసారమన్నది నీళ్ళ కుండలాంటిది. కాస్త ఆదమరిచామా జారిపగిలిపోతుంది.... కుండ...నీళ్ళన్నీనేల పాలవుతాయి. ఉగాదికి అల్లుడు, నువ్వు తప్పకుండా రావాలి. ఉంటాను ఆశీర్వాదాలతో ... మీ అమ్మ"

సంగీతమ్మ.

సునీత మెదడు మొద్దుబారిపోయింది. జీతంలో మూడొందలు తగ్గడం గుర్తుకొచ్చింది. ఇరుగు పొరుగు మీ కేమమ్మా మీ ఆయన బ్యాంకు ఆఫీసరు నెలకు నాలుగువేలు జీతం అవడం గుర్తుకొచ్చింది. మరి మిగతా డబ్బుఏమైపోతున్నట్టు? ఆమె మనసు అందోళన చెందడం మొదలెట్టింది.

"ఏమండీ.... మీ జీతం ఎంతండి ?" ఆ రాత్రి నసిగింది సునీత.

"మొగవాడి జీతం .... ఆడదాని వయసు అడక్కూడదని సామెత ఉంది.. తెలీదా?" మాట తప్పించాడు.

"పోనీ నా వయసు చెబుతాను ... మీ జీతం చెప్పండి"

"ఊహు నీ కేం కావాలో చెప్పు.... తెప్పిస్తాను."

"మీ దగ్గర ఎంతుందో తెలీకుండా నాకేం కావాలో ఎలా అడగనండి?" సునీత మురిపెంగా అంది.

"తక్కువ పడితే అప్పు చేస్తాను...సరేనా ?" సుందరం చెప్పాడు.

"అంతేగాని మీ జీతం ఎంతో చెప్పరు!" బాధగా అంది.

"ఎన్నడూ లేంది నీకు సందేహం ఎందుకొచ్చింది.?"

"అంతే లేండి... జీతం చెబితే ...మీరెంత దుబారా ఖర్చు పెడతారో నాకర్థం అవుతుంది....రేపటి నుండి మీ పేకాటకు తిరుగుళ్ళకు డబ్బులుండవు. !"

"సునీతా !" కోపంగా అరిచాడు. సగం లేచిన చెయ్యిని బలవంతంగా దింపుకున్నాడు.

"ఊ! ఆగారేం! కొట్టండి.. ఇన్నాళ్ళు నన్ను ఎందుకు కొట్టలేదా్దని ఆశ్చర్యపోతున్నాను. కొత్త మోజు తీరిందిగా, ఇంకా మామూలు మొగాళ్ళలాగా పెళ్ళాన్ని కొట్టండి."సునీత రోషంగా అంది.

"ఛీ!ఛీ! ఏమిటామాటలు.. నీకు తెల్సుగా నా ప్రవర్తన, నాకు ఆఫీసులోనే లేటవుతుంది. నేరుగా ఇంటికి వస్తాను."

"ఆ....ఎవరు చూడొచ్చారు లేండీ!" పెడసరంగా అంది.

"సునీతా! భార్యా భర్తల మధ్య అనుమానాలుండకూడదు . కావలసింది అవగాహన.నన్ను నమ్ము. నాకు ఏ చెడు అలవాటు లేదు...కాదు కూడా!" సుందరం గట్టిగా చెప్పాడు.

"ప్రామిస్!" మెరిసే కళ్ళతో అడిగింది సునీత.

"యస్ ప్రామిస్!" సుందరం వాగ్దానం చేశాడు.

కాని ఆనెల కూడా పదిహేను వందలే అందాయి సునీతకు . సునీతా అడగలేదు.

సుందరం ప్యాంటు , షర్టు ఉతకడానికి కూర్చుని సునీత..సుందరం షర్టు జేబులో కాగితాలు తీస్తూ కావాలని ఓసారి తడిమింది. జేబులో ఏదో తగిలింది. తీసింది బయటకు ఇన్‌లాండు లెటరు. చిరునామా చూసింది. సుందరేశం నుండి... అంటే మామగారి దగ్గరనుండి.

సుందరం ఇస్తే సునీత అతనికొచ్చిన ఉత్తరాలు చదువుతుంది, తనంతట తను అడిగి చదవదు. అందుకని ఓ క్షణం చదవాలా వద్దాని తటపటాయించుకుని చదివింది. ఉత్తరంలో ఓ పేరా ఆమెను ఆశ్చర్యంలో ముంచింది.

"బాబూ! సుందరం! కిందటి నెల నుండి పన్నెండు వందలు పంపిస్తున్నందుకు మాకు చాలా ఆనందంగా ఉంది. మందులకు కొంచెం డబ్బు ఖర్చవుతున్నదని రాసిందానికి ఒకేసారి మూడువందలు

ఎక్కువ పంపిస్తున్నందుకు సంతోషం బాబు."

అంటే సుందరం తన ఇంటికి పన్నెండు వందలు పంపిస్తాడా ఆశ్చర్యం కలిగింది. వచ్చిన డబ్బులన్నీ వాళ్ళకీ వీళ్ళకీ పంపించి సంసారం గుల్లచేస్తాడేమో అని అమ్మ అనుమానపడింది ఎందుకో అర్థం అయింది.

కాని బాధ్యత నిర్వహిస్తున్నందుకు సునీతకు సంతోషం కలిగింది. వాళ్ళకు మటుకు ఎవరున్నారు ? అత్త మామ ఒంటరిగా ఓ గ్రామంలో ఉంటున్నారు. ఉద్యోగరీత్యా ఈయన ట్రాన్సుఫరయి ఈ ఊరు వచ్చేశారట సంవత్సరం క్రిందట సంసారానికి వచ్చిన కొత్తల్లో అడిగింది. ..అత్తా మామల్ని పిలిపించండి ..అందరం కలిసి ఉందామని కాని... ప్రైవసీ కావాలని తన మాట దాటేస్తూ ఉండేవారు సునీత ఆలోచనలో పడింది.

"ఏమండీ... అత్తగారికి మావయ్యగారికి ఆరోగ్యం బాగా లేదా..." సునీత సుందరాన్ని అడిగింది, ఆఫీసునుండి రాగానే.

"ఆ! బావుండటం లేదట... పెద్ద వయసు... మందులు తీసుకోమని రాశాను." బాధపడ్తూ చెప్పాడు సుందరం.

"అంటే.. అంతటితో మీ బాధ్యత అయిపోతుందా?" సునీత కోపంగా అడిగింది.

"ఇంకేం చెయ్యాలి... డబ్బులు కూడా పంపాలే..." విసుగ్గా అన్నాడు.

"అంతటితో మీ బాధ్యత తీరిపోతుందా?"

"ఇంకేం చెయ్యమంటావు... ఇక్కడికి తీసుకొచ్చి మన దగ్గర ఉంచుకుందామా... మందులిప్పిస్తాను... బాగు చేస్తాను... కాని ఓ పదిరోజులయ్యేసరికి అత్తా కోడళ్ళకు కొట్లాటలు వస్తాయి... ప్రైవసీ పోతుంది", చిరాగ్గా అన్నాడు.

"అదే మీ భయం అయితే ఆ భారం నాకు వదిలెయ్యండి ఇవ్వాళే ఉత్తరం రాశాను... అత్తయ్యా మావయ్యలను మన దగ్గరికి వచ్చెయ్యమని... మనకి కావాలసింది అనురాగం... ఏకాంతం కాదు... వాళ్లకి కావలసింది డబ్బులు కాదు- ఆప్యాయత... కొడుకు కోడలు వాళ్ల కళ్ళ ముందు మెదలడం". చురుగ్గా చెప్పి లోపలికి వెళ్ళింది సునీత.

సుందరం తల తిరిగిపోయింది. "గురూ! మీ ఆవిడకు మీ వాళ్ళకు డబ్బులు పంపిస్తున్నట్లు తెలీయనీకు గురూ... పంపనీయకుండా చేస్తుంది", అన్న వాసు మాటలు విని తను సునీతను ఎంతోతక్కువ అంచనా వేశాడు- అని బాధపడ్డాడు.

